క్లుప్తంగా

రైతులు సహకరించాలి

కోవూరు : మండలంలోని పడుగుపాడు సహకార సొసైటీ కార్యాలయంలో రికార్డులను ఆన్‌లైన్ చేస్తున్న క్రమంలో సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులు పూర్తిగా సహకరించాలని ఆ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. స్థానిక శాంతినగర్‌లో ఉన్న సొసైటీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులు తమ ఆధార్, పొలానికి సంబంధించిన జెరాక్స్ కాపీలు, పాస్‌కార్డు జెరాక్స్ కాపీలను ఐదు రోజుల్లోగా అందజేయాలన్నారు. సొసైటీకి సంబంధించి ఇప్పటివరకు బంగారంపై రూ.7 కోట్ల మేర రుణాలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా సొసైటీ ప్రాంగణంలో ఈనెల 15వ తేదీన 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాము నిర్మాణ పనులను ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పాలకవర్గాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నుంచి బుధవారం ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్, సొసైటీ డైరెక్టర్లు జనార్దన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జల్‌జీవన్ మిషన్ పనులు

కోవూరు : మండల పరిధిలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన గ్రామాల్లో పొదుపు గ్రూపుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్‌ల కింద జల్‌జీవన్ మిషన్ పనులను పారదర్శకంగా చేపట్టేలా తగిన ప్రణాళికలు రూపొందించినట్లు జల్‌జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ లవకుమార్ అన్నారు. కోవూరులోని సంఘమిత్ర సమావేశ మందిరంలో జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి పొదుపు లీడర్లు, వీఓఏలతో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సురక్షిత నీరు అందించాలన్నదే జల్‌జీవన్ మిషన్ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ పనులకు సంబంధించి ప్రతి గ్రూపులో 11 మంది సభ్యులుగా ఉంటారని, అందులో తొమ్మిది మంది పొదుపు సభ్యులు కాగా, ఒకరు ఇంజినీరింగ్ ఇసిస్టెంట్, మరొకరు పంచాయతీ కార్యదర్శి ఉంటారన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, ఏపీఎం వెంకట స్వామి పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు రాము, సౌరీ, వసంత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ బోల్తా పడి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో బుధవారం జరిగింది. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మోహన్‌కృష్ణ పనినిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి బుచ్చిరెడ్డిపాళెం వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మోహన్‌కృష్ణకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆమె పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని, ఇక్కడ ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు మందులను కూడా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు, డాక్టర్ ఖాదర్‌వలీ, కౌన్సిలర్లు షకీల, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



వెంకటాచలం : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అభినందించారు. వీఎస్‌యూ విద్యార్థులు వి.ప్రవీణ్, కె.విష్ణు గణేష్, సుబ్రహ్మణ్యం, ఎస్.నరసింహులు, లతీష్‌కుమార్, రవికుమార్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. వీరికి కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి బుధవారం ట్రాక్ సూట్లను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపి వీఎస్‌యూకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్ బాబు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సునీత, వై.రవీంద్రమ్మ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించి.. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గల సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల ఏర్పాటు, బ్యారికేడ్ల నిర్మాణం, విద్యుత్ సదుపాయం, వృద్ధులు.. దివ్యాంగుల కోసం వీల్ చైర్లు తదితరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత చర్యలను చేపట్టడంతో పాటు పాత భవనాల స్థానంలో ఇతర భవనాలను ఎంపిక చేయాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఇంటర్నెట్, టెలిఫోన్ సదుపాయాలను పరిశీలించాలని కోరారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గాలు, రోడ్లు, పార్కింగ్ సౌకర్యం తదితరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పునఃపరిశీలించి ఓటరు జాబితాలో సవరణలను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. 6, 7, 8 ఫారాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని పేర్కొన్నారు. ఏఈఆర్వో దేవీకుమారి, అర్బన్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

పన్నులను వసూలు చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో అస్తి, కుళాయి, డ్రైనేజీ పన్నుల వసూళ్ల లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ రెవెన్యూ శాఖ అధికారులు, సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నులు చెల్లించని కమర్షియల్ భవనాలను గుర్తించాలని సూచించారు. మొండి బకాయిదారులను గుర్తించి వారికి సంబంధించిన ఆస్తులను జప్తు చేయడంతో పాటు కుళాయి, డ్రైనేజీ కనెక్షన్లను తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయ భవనాల విషయమై సంబంధిత విభాగాలను సంప్రదించి గడువులోపు వసూలు చేయాలని సూచించారు. నగరపాలక సంస్థ అద్దె షాపుల బకాయిలను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డేను విజయవంతం చేయండి

డీ వార్మింగ్ డేను విజయవంతంగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బందితో సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండాజోల్ మాత్రలను విద్యార్థులకు శుక్రవారం అందించేలా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాని ఒకట్రెండేళ్ల చిన్నారుల ఇంటికెళ్లి మాత్రలను అందించాలని చెప్పారు. అదనపు కమిషనర్ శర్మద, డాక్టర్ జిజియాబాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఖలీల్ అహ్మద్ తదితరులు

• ఖలీల్ అహ్మద్

నెల్లూరు(బారకాసు): మహిళల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేసి.. ప్రతి పథకంలోనూ వారికి అవకాశం కల్పించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గసమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడతలో భాగంగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మైపాడు గేట్ సెంటర్ సమీపంలోని కేపీఆర్ కల్యాణ మండపంలో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. నగరంలో దాదాపు 40 వేల డ్వాక్రా సంఘాల కుటుంబాలు సీఎం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. సీఎం.. నెల్లూరు నగర ఎమ్మెల్యే ఆశీస్సులు.. నగర ప్రజల సహకారంతో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందుతానని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాటు కనిపించని నారాయణ ఇటీవల వచ్చి నగరాన్ని అభివృద్ధి చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. నేతలు ముజీర్, శంకర్‌రెడ్డి, 42, 44వ డివిజన్ల కార్పొరేటర్లు కరిముల్లా, రాఘవరావు, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, అతహర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యమిచ్చే వారికే మద్దతు

నెల్లూరు (వేదాయపాళెం): రానున్న ఎన్నికల్లో బీసీలకు అధిక శాతం సీట్లు కేటాయించే పార్టీకే తమ మద్దతు ఉంటుందని యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు ఒట్టూరు సంపత్‌రాజ్ పేర్కొన్నారు. ఆదిత్యనగర్‌లోని తన నివాసంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో అవకాశం కల్పించాలని కోరారు. బీసీల్లో ఏ కులానికి సీట్లు కేటాయించినా యాదవులు అండగా ఉంటారని చెప్పారు. నేతలు యనమల నాగేశ్వరరావు, ఆనంగి రమణయ్య, జనార్దన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంపత్‌రాజ్

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): సీఎం జగన్‌మోహన్ రెడ్డిని సచివాలయ ప్రాంగణంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాశెం సుధీర్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పలు అంశాలపై సీఎంతో ఆయన మాట్లాడారు.

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం జగన్‌మోహన్ రెడ్డిని వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు గానూ పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలను తెలియజేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడి న్యాయం చేయాలి

నెల్లూరు(మినీబైపాస్): మూలాపేటకు చెందిన ఎంసీఏ చదివిన కొత్తపల్లి కీర్తికి నగరంలోని ఓ వైద్యశాల నిర్దేశించిన మందులు వికటించాయని, ప్రాణాలు కాపాడి న్యాయం చేయాలని తల్లి నీరజ కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడారు. శరీరంపై దద్దుర్లు రావడంతో నగరంలోని ఓ హోమియో క్లినిక్‌కు తీసుకెళ్లగా, వారు ఇచ్చిన మందులు వికటించాయని చెప్పారు. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో ఐసీయూలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోందని వాపోయారు.

గ్యాస్ లీకై ఎగసిన మంటలు

పొదలకూరు : పట్టణంలోని కేఆర్ నగర్ సమీపంలో ఓ భవన నిర్మాణానికి వచ్చిన కూలీలు బుధవారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ అధికారి విజయకు మార్ ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రమాదం సంభవించకుండా మంటలను ఆర్పివేశారు. గ్యాస్ పైపు నాణ్యతా లోపం వల్ల మంటలు వచ్చినట్లు గుర్తించి కూలీలకు గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు.

సింగిల్ విండో క్యాంప్ 12కు వాయిదా

పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 9వ తేదీన నిర్వహించాల్సిన తల్లీబిడ్డలకు ఆధార్, జీరో అకౌంట్ బ్యాంక్ ఖా తాల క్యాంప్‌ను ఈనెల 12వ తేదీకి వాయిదా వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ బుధవా రం తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో సింగిల్‌వి ండో క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' విజయకేతనం

నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనాన్ని ఎగురవేశారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గోమతినగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో బుధవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. సూరజ్ 300కు 300, రితేష్‌రెడ్డి 281, శ్రీనికేష్ 280, విఘ్నేష్ సిద్ధూ 262, సుబ్రహ్మణ్య కల్యాణ్‌రామ్ 252, చరిత సాయి సుష్మ 251 మార్కులను సాధించారని తెలిపారు.



దిశ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



సాయినాథ్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా సాయినాథ్ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. ఇన్‌స్పెక్టర్లు రామారావు, అజయ్‌కుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

పదోన్నతిపై..

అనంతపురం జిల్లాకు చెందిన సాయినాథ్ 1995లో పోలీస్‌శాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా పనిచేశారు. 2008లో సీఐగా పదోన్నతి పొంది చిత్తూరు, ఇంటెలిజెన్స్, అనంతపురం పీటీసీలో పనిచేసి ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందారు.

10న ఆర్కెస్ట్రా బ్యాండ్ సంగీత కార్యక్రమం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ తదితరులు

నెల్లూరు(బృందావనం): మహానగరాలకే పరిమితమైన నూతన ఆర్కెస్ట్రా బ్యాండ్ సంగీత వినోద కార్యక్రమాన్ని నెల్లూరులో నిర్వహించనుండటాన్ని ఆర్డీఓ మలోల అభినందించారు. నగరంలోని పురమందిరంలో ఎస్సార్ లైవ్ ఆర్కెస్ట్రా బ్యాండ్ కార్యక్రమాన్ని ఈ నెల పదిన నిర్వహించనున్న నేపథ్యంలో బ్రోచర్లను ఆర్డీఓ బుధవారం ఆవిష్కరించారు. రేబాలవారివీధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అగ్రశేణి గాయకులు 30 మందిని సింహపురికి ఆహ్వానించి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు రాజ్, సాగర్‌ను అభినందించారు. ట్యాక్స్ కన్సల్టెంట్ కృష్ణమోహన్, టీవీ నటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, వివిధ ఆర్కెస్ట్రాల నిర్వాహకులు పెంచలరెడ్డి, ప్రశాంతి, ప్రసాద్‌బాబు, రవీంద్రనాథ్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని అన్ని విద్యుత్ సెక్షన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల తన చాంబర్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగరంలోని 11 సెక్షన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బీవీనగర్, హరనాథపురం, కోటమిట్ట, డైకస్‌రోడ్డు సెక్షన్ల పరిధిలో రూ.25 లక్షలతో ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తిన సమయాల్లో 91333 31912 వాట్సాప్ నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

నెల్లూరు(మినీబైపాస్): నగరంలో ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ నేతలు బుధవారం ప్రారంభించారు. తొలుత గాంధీబొమ్మ సమీపంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పూజలు చేసి కరపత్రాలను ఆవిష్కరించారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నేతలు సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మిడతల రమేష్, జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యభిచార గృహంపై దర్గామిట్ట పోలీసులు దాడి చేశారు. వివరాలు.. ముత్తుకూరుకు చెందిన ప్రభుదాస్ కొంతకాలం క్రితం టెక్కేమిట్ట రైల్వేట్రాక్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. బెంగళూరు, పశ్చిమబెంగాల్ తదితర ప్రాంతాలకు చెందిన మహిళలను తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై నరేష్ తన సిబ్బందితో కలిసి ఫ్లాట్‌పై మంగళవారం అర్ధరాత్రి దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు ఆకుతోట వడ్డిపాళేనికి చెందిన వెంకటేష్, వెంకటాచలం మండలానికి చెందిన రాజ్ ప్రమీల్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సెక్స్‌వర్కర్లను హోమ్‌కు తరలించారు.

కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగం



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

నెల్లూరు (టౌన్): నాలుగేళ్ల డిగ్రీ హానర్స్‌ను రాష్ట్రంలో ప్రవేశపెట్టారని, ఈ విధానంలో భాగమైన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగమని ఏపీ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిగ్రీ హానర్స్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డిగ్రీ హానర్స్ విధానంలో పది నెలల ఇంటర్న్‌షిప్ ఉంటుందని.. బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణను ఏర్పాటు చేశామని వివరించారు. ఏపీ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అనేక కంపెనీలతో ఎంఓయూలను కుదుర్చుకుందని తెలిపారు. విద్యార్థులకు చివరి సంవత్సరంలో శిక్షణ ఇప్పించి కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు సాధించే అవకాశాన్ని కల్పిస్తోందని వెల్లడించారు. కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రాణా ప్రమోద్, డీన్ సుధారాణి, అడ్మిన్ డీన్ రామాంజనేయరెడ్డి, ప్రిన్సిపల్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

16 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు ఈ నెల 16 వరకు కోర్టు విధులను బహిష్కరించనున్నారని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మెజార్టీ న్యాయవాదుల అభిప్రాయం మేరకు విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. న్యాయవాదులు సహకరించాలని కోరారు.

'డీకేడబ్ల్యూ'లో శిక్షణ నేడు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాల ప్రిన్సిపల్స్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లకు శిక్షణను నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో గురువారం నిర్వహించనున్నామని ఆర్‌ఐఓ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా డీఆర్వో లవన్న హాజరుకానున్నారని చెప్పారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు రూ.ఎనిమిది వేల నుంచి రూ.పది వేల చొప్పున రూ.5.12 లక్షల మేర స్కాలర్‌షిప్‌లను మలబార్ గోల్డ్ యాజమాన్యం అందజేయనుందని ఆర్‌ఐఓ తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం పది గంటలకు నిర్వహించనున్నారని వివరించారు.

డైరీ ఆవిష్కరణ

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నెల్లూరు, కావలి డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు దయాకర్, రంగవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'గణేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలి'

నెల్లూరు (వేదాయపాళెం): ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ గణేశ్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఘటనను తీవ్రంగా ఖండించారు.



సుబ్రహ్మణ్యేశ్వర సైకత శిల్పం

అవధూత దత్తపీఠం మైసూరు ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామి ఈ నెల 14న నెల్లూరు రానున్న సందర్భంగా ఆయన ఇష్టదైవం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సైకత శిల్పాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్లు దత్తాత్రేయస్వామి భక్త మండలి కన్వీనర్ రుష్యేంద్రబాబు బుధవారం తెలిపారు. ముత్తుకూరు మండలం ఏరూరు గ్రామం వద్ద సముద్ర తీరంలో నాలుగున్నర అడుగుల ఎత్తు, ఆరు అడుగుల వెడల్పులో నెమలి వాహనాన్ని అధిష్టించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రూపాన్ని సైకత శిల్పి సనత్‌కుమార్ తీర్చిదిద్దారని తెలిపారు. – నెల్లూరు(బృందావనం)